## క్లుప్తంగా

### అప్పన్నకు పచ్చలహారం బహూకరణ



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం రూ. 30 వేలు విలువ చేసే వెండి హారాన్ని ఏపీ స్వర్ణకారుల సంఘం పీఆర్వో గుంటుపల్లి ప్రసాద్ ఆలయ అలంకారి పురోహిత్ కరి సీతారామాచార్యులకు అందజేశారు. దేవస్థానం తరఫున అధికారులు రశీదును ప్రసాద్‌కు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, అర్చకుడు టి.పి.రాజీవ్‌లోచన్ పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన ఎన్టీపీసీ నూతన జీజీఎం



అనకాపల్లి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సింహాద్రి జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె. సిన్హా గురువారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో సంస్థ సీఎస్సార్ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, ముందు చేపట్టనున్న పనులపై చర్చించారు.

### బ్రేక్‌డౌన్ లేని సర్వీసులు



సింహాచలం డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎంఈ అప్పలనాయుడు

గోపాలపట్నం: బ్రేక్‌డౌన్ లేని సర్వీసులను ప్రయాణికులకు అందించాలని డిప్యూటీ సీఎంఈ బి.అప్పలనాయుడు సూచించారు. సింహాచలం ఆర్టీసీ బస్ డిపోను గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. డిపోలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ రోడ్డుపై మరమ్మతులకు గురై బస్సులు నిలిచిపోయే పరిస్థితి రాకూడదన్నారు. జీరో బ్రేక్‌డౌన్ సర్వీసులు అందివ్వాలని కోరారు. ఇక్కడి డిపోలో ఉన్న సమస్యలు, ఇబ్బందులు సిబ్బందిని అడిగి అప్పలనాయుడు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.రాజశేఖర్, మెకానికల్ ఇన్‌చార్జి కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### రక్తహీనత పట్ల అప్రమత్తం



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: రక్తహీనత పట్ల బాల బాలికలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ ఎంపీడీవో వి. హేమసుందర్రావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా బాలబాలికలు, మహిళల్లో సోకే రక్తహీనతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం సీడీపీవో లలితకుమారి మాట్లాడుతూ బాలబాలికల్లో వచ్చే రక్తహీనత, బాల్య వివాహాలు, పౌష్టికాహారం గురించి వివరించారు. రక్తహీనత నివారణపై గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి పద్మజ, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### 'కెమికల్' విద్యార్థినికి ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థిని దాసరి వంశీప్రియాంక ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి పొందింది. రూ.6.73 లక్షల వార్షిక వేతనంతో ఏసియన్ పెయింట్స్ కంపెనీలో ఉద్యోగం సాధించింది. ఇంతవరకు డిప్లమా విద్యార్థులకు ఇంతటి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చిన దాఖలాలు లేవని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వంశీప్రియాంక ఈ కాలేజీలో కెమికల్ ఇంజినీరింగు కోర్సులో 2018లో చేరి 2022 ఏప్రిల్‌లో పాస్‌అవుట్ అయింది. ఈమెకు అచ్యుతాపురంలోని ఏసియన్ పెయింట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ప్రిన్సిపాల్‌తో పాటు డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎం.విజయలక్ష్మి.. ప్రియాంకను అభినందించారు.



# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్య కల్యాణం
- విశేషంగా గరుడసేవ



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



జీలకర్ర, బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణమండపంలో వేదికపై ఆశీలను చేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు కుమారాచార్యులు, శ్రీకాంత్ ఈ సేవను నిర్వహించారు.

**వైభవంగా నిత్యకల్యాణం**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

**విశేషంగా గరుడసేవ**

శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని గరుడవాహనంపై ఆశీనులను చేశారు. అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

## ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో హోమం



రుద్ర రాజశ్యామల అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కుటుంబ సభ్యులు

సింహాచలం : పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో రాంపురంలోని ఆయన స్వగృహంలో రుద్ర రాజశ్యామల అమ్మవారి హోమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే 108 మంది ముత్తైదువులతో లక్ష కుంకుమార్చన పూజను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా బాగుండాలని, లోకం సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే శక్తి ప్రసాదించాలని హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం జరిగే మహాపూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు.

## అప్పన్న సన్నిధిలో కేంద్ర శాఖ కార్యదర్శి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న అల్కేష్‌కుమార్‌శర్మ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ శాఖ కార్యదర్శి అల్కేష్‌కుమార్‌శర్మ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

## ఆగమశాస్త్ర విశిష్టతపై అర్థవంతమైన వివరణ



కరి సీతారామాచార్యులను సత్కరిస్తున్న సెమినార్ నిర్వాహకులు

సింహాచలం: తిరుపతిలో వెంకటేశ్వర వేదిక్ యూనివర్శిటీ రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సెమినార్‌లో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పురోహిత్ అలంకారిగా విధులు నిర్వర్తిస్తున్న కరి సీతారామాచార్యులు పాల్గొని గురువారం పాంచరాత్ర ఆగమశాస్త్ర విశిష్టతను వివరించారు. దాదాపు రెండు గంటల పాటు ఆయన ప్రసంగించారు. వైఖానస, పాంచరాత్ర, శైవాగమానికి సంబంధించి బాలాలయ ప్రక్రియపై ఈనెల 19,20 తేదీల్లో తిరుపతిలో వెంకటేశ్వర వేదిక్ యూనివర్శిటీ నిర్వహిస్తున్న సెమినార్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పండితులు పాల్గొనగా, సింహాచలం దేవస్థానానికి చెందిన సీతారామాచార్యులు కూడా అందులో పాల్గొని పాంచరాత్ర ఆగమశాస్త్రంపై ప్రసంగించి ఒక నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా సీతారామాచార్యులను సెమినార్ కన్వీనర్ డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు, కోఆర్డినేటర్ డాక్టర్ కేహెచ్ రాజేష్‌కుమార్ ఘనంగా సత్కరించి సన్మాన పత్రం అందజేశారు.

## మంచినీటి బోర్ ఏర్పాటు



సాలాపువానిపాలెంలో మంచినీటి బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పరవాడ: జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెం గ్రామ ప్రజల దాహార్తి తీర్చడానికి వీలుగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బోర్‌వెల్ మంజూరు చేయించారు. గ్రామానికి మంజూరైన బోర్ వెల్ నిర్మాణ పనులను గురువారం పూర్తి చేశారు. ఈ ప్రాంత ప్రజల నీటి ఎద్దడి తీర్చడానికి మంచినీటి బోరు ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంచినీటి బోరు నిర్మాణ పనుల కార్యక్రమంలో స్థానిక సచివాలయ కన్వీనర్లు సాలాపు సంతోష్, శ్రీను, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు, అప్పలరాజు, దొరబాబు, రామకృష్ణ, నూకరాజు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్వారీ గుంతలో దిగి యువకుడి మృతి



మృతుడు యశ్వంత్

సింహాచలం : క్వారీ గుంతలో స్నానానికి దిగి యువకుడు మృతి చెందిన ఘటన పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధి నరవ శివారులో చోటు చేసుకుంది. పెందుర్తి లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కుర్మన్నపాలెంలోని వుడా కాలనీలో ఉంటున్న నిడమనూరి యశ్వంత్ (22) నగరంలోని ఒక కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. యశ్వంత్‌కి ఫొటోషూట్ చేయడం అంటే ఇష్టం. ఈ తరుణంలోనే గడిచిన బుధవారం తన ఇంటికి సమీపంలో ఉంటున్న ముగ్గురు బాలురతో ఫొటోలు తీస్తానని చెప్పి వారితో కలిసి నరవ శివారులోని క్వారీ గుంత వద్దకు ఫొటోషూట్‌కి వెళ్లాడు. క్వారీ గుంతలో స్నానానికి దిగి మునిగిపోయాడు. వెంటనే ముగ్గురు బాలురు 100కి ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. అలాగే యశ్వంత్ తల్లి పద్మావతికి ఫోన్‌లో తెలిపారు. విషయం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్ల సాయంతో బుధవారం సాయంత్రం వరకు గాలింపు జరిపారు. కానీ యశ్వంత్ జాడ కనిపించలేదు. రాత్రి అవుతుండటంతో గాలింపుని నిలుపుచేసి గురువారం ఉదయం మరోసారి గాలింపు చేపట్టారు. ఈ తరుణంలోనే యశ్వంత్ మృతదేహం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. మృతుడి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా వేమన జయంతి



వేమన పద్యాల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సింహాచలం : పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, వేమన పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రావీణ్యం ప్రదర్శించారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ మూర్తి బహుమతులు అందజేశారు. తెలుగు సబ్జెక్ట్ ఉపాధ్యాయినిలు శారద, బాలమణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాత టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

భారీగా ఎగసిపడ్డ మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గాజువాక : స్థానిక శ్రీనగర్‌లోని సివిల్ సప్లయిస్ గోడౌన్ల సమీపంలో గల ఒక పాతటైర్ల దుకాణంలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వంట కోసం కర్రల పొయ్యి వెలిగించడానికి పెట్రోల్ పోయడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సతేందర్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి శ్రీనగర్‌లోని సివిల్ సప్లై గోడౌన్ల వద్ద పెట్రోల్ బంక్‌ను ఆనుకొని పాతటైర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సిబ్బందిని నియమించుకొని పాత టైర్లకు పంక్చర్లు వేయడంతోపాటు రీబటనింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. అందులోనే వంట చేసుకోవడం కోసం గురువారం కట్టెల పొయ్యి వెలిగించారు. అది మండటం కోసం అందులో పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంట పైకి వచ్చి అక్కడి పాతటైరుకు అంటుకుంది. ఆ మంట క్షణాల్లో మొత్తం దుకాణమంతా విస్తరించింది. దీంతో దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. పొగలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయి. సంఘటన చోటుచేసుకున్న దుకాణానికి ఆనుకొని పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది రెండు శకటాలతో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాజువాక సీఐ ఎల్. భాస్కరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రాథమిక విచారణ నిర్వహించారు.

## పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకం

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో స్వామికి గురువారం సాయంత్రం త్రయోదశి ప్రదోషకాల అభిషేకాన్ని విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



విశేష అలంకారంలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

## చకచకా సచివాలయ భవన నిర్మాణాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కలపాక గ్రామ సచివాలయ భవనం

పరవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పరవాడ మండలంలో చేపట్టిన గ్రామ సచివాలయ భవనాల నిర్మాణ పనులు చకచకా పూర్తవుతున్నాయి. మండలంలో 14 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. కోటి నిధులు మంజూరు చేసింది. వాటిలో నిర్మాణ పనులు పూర్తి చేసిన 5 గ్రామ సచివాలయ భవనాలను గతంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. ప్రస్తుతం 9 సచివాలయ భవనాల్లో కలపాక, గొర్లివానిపాలెం గ్రామాల్లోని సచివాలయ భవనాలు నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. మరో గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. రూ.25 లక్షలతో వాడచీపురుపల్లిలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేశారు. పెయింటింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. పెదముషిడివాడ, భర్నికం, రావాడ గ్రామాల్లో ఒక్కొక్క సచివాలయ భవనానికి మంజూరైన రూ.25 లక్షలతో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. రూ.40 లక్షలతో తానాం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సచివాలయ భవనానికి గచ్చులు, విద్యుత్, పెయింటింగ్ పనులు మినహా అన్ని పనులు పూర్తి చేశారు. పరవాడలో రూ. 35 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవన నిర్మాణం పనులు పూర్తవుతుండగా, వాడచీపురుపల్లిలో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ భవనానికి శ్లాబు వేయాల్సి ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈ గండి రామారావు చెప్పారు.

## క్రీడలతో ఆనందం.. ఆరోగ్యం



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు



వెదుళ్లనరవ, సబ్బవరం 7 బ్రదర్స్ జట్ల మధ్య రసవత్తరంగా సాగుతున్న పోటీ

సబ్బవరం: క్రీడలు యువతలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో కొలువైన సీతారాముల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 16 జట్లు పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేలు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బలిరెడ్డి కనకరాజు, సంద్రాన అప్పారావు, బలిరెడ్డి అప్పారావు, గుజ్జా శ్రీను, పంచాయితీ కార్యదర్శి లతకుమారితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉగాది నాటికి జగనన్న ఇళ్లు పూర్తి కావాలి



సమీక్షలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి

సబ్బవరం: ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను శతశాతం పూర్తి చేయడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పలు శాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులతో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించామన్నారు. ఉగాది నాటికి మండలంలోని పలు జగనన్న కాలనీల్లో 698 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటిలో ఇప్పటికే 50 శాతం గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుని పని చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు నాడు–నేడుతో పాటు అన్ని ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిపై విస్తృతంగా సమీక్షించామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఈవోపీఆర్డీ మహేష్, ఎవో ఎస్. బాబురావు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణతో పాటు పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇది మహిళలకు మేలు చేసే ప్రభుత్వం



స్వాభిమాన్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: మహిళలకు మెరుగైన గౌరవం, అవకాశాలు కల్పించే దిశగా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని పలు శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన స్వాభిమాన్ (ఆత్మ గౌరవం) అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిత్యం శారీరకంగా, మానసికంగా శ్రమించే మహిళలు పౌష్టికాహారం తీసుకునే పరిస్థితి లేదన్నారు. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం స్వాగతించదగ్గ విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి హాజరు కాకపోవడంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమారి, ఎంపీడీవో రమేష్‌నాయుడు, మండల పరిషత్ ఏవో ఎస్.బాబురావు, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి చక్రవర్తి, ఎంఈవో అప్పలరాజుతో పాటు పలు శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ వలంటీర్లకు ఆహ్వానం



ఎస్ఐ రమేష్

సింహాచలం : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో స్వచ్ఛంద ట్రాఫిక్ వలంటీర్లుగా సేవలందించే వారికి ఆహ్వానం పలుకుతున్నట్టు ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆసక్తి గల యువకులు, వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘ సేవకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. పోలీసులతో కలిసి రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, రోడ్డు ప్రమాదాల నివారణకు సూచనలు అందించడం, ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించడం.. ప్రజలు, విద్యార్థులు, వాహన చోదకులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించడం వంటి విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులతో కలిసి పని చేయాల్సి ఉంటుందన్నారు. పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయుడుతోట, వేపగుంట, సింహపురికాలనీ, సుజాతానగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, పినగాడి, పెదగాడి, చినముషిడివాడ, పెందుర్తి జంక్షన్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో స్వయంగా కాని, 9440796064 ఫోన్‌లో గాని సంప్రదించాలని తెలిపారు.